నిమ్స్‌లో పార్కింగ్ పరేషాన్

● అంబులెన్స్‌లకు దారిలేని పరిస్థితి
● నిర్మాణ పనులతో పెరిగిన రద్దీ


నిమ్స్ అంతర్గత రోడ్లపై నిలిచిన వాహనాలు

సనత్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆస్పత్రిగా పేరొంది న నిమ్స్‌లో పార్కింగ్ సమస్య వేధిస్తోంది. నిమ్స్ అంతర్గత రహదారుల్లో వాహనాలు నిలపడం వల్ల వాహనాలు ముందుకు సాగడం లేదు. దాదాపు అన్ని విభాగాల్లో విశేష సేవలందిస్తున్న నిమ్స్‌లో చికిత్స పొందేందుకు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు వస్తున్నారు. నిమ్స్‌కు రోజు పెద్ద సంఖ్యలో ఇన్‌పేషెంట్లు, అడ్మిషన్లు, ఎమర్జెన్సీ కేసులు వస్తుంటాయి. అంతేకాకుండా వారు వ్యక్తిగత వాహనాలతో పాటు ఆటోలు, క్యాబ్‌లో వస్తుంటారు, అత్యవసర కేసులు అంబులెన్స్‌లలో వస్తుంటాయి. ప్రస్తుతం నిమ్స్‌లో పార్కింగ్ స్థలం సరిపోక పోవడంతో రోగులు వాహనాలు అంతర్గత రోడ్లపై నిలుపుతున్నారు. దీని కారణంగా నిమ్స్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. నిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, రోగులు, సహాయకులు, సందర్శకులు ఇలా ప్రతి ఒక్కరికి ఇది ఇబ్బందిగా మారింది. వాహనాలు రోడ్డు పక్కన నిలపడం వల్ల కొన్నిసార్లు అంబులెన్స్‌లు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. నిమ్స్‌లో కొత్తగా నిర్మిస్తున్న 2వేల పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో నిర్మాణ పనులతో వాహనాల రద్దీ పెరిగి పరిస్థితి మరింత దిగజారింది. పార్కింగ్ సమస్యపై నిమ్స్ ఆస్పత్రి సిబ్బంది, అధికారులు స్పందించాలని రోగులు, ఆస్పత్రికి వచ్చే వారు కోరుకుంటున్నారు.

సమాజానికి సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శం

ప్రొ.చల్లపల్లి స్వరూపారాణి ● అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో పూలే స్మారకోపన్యాసం

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సావిత్రీబాయి పూ లే జీవితం సమాజానికి ఆదర్శమని, మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంలో పురుషుల ఆధిపత్యాన్ని ప్రశ్నించారని నాగార్జున విశ్వవిద్యాలయ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చల్లపల్లి స్వరూపారాణి అన్నారు. సావిత్రీబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని డా.బి.ఆర్ అం బేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సోమవారం స్మారకోపన్యాసం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధిపత్య వర్గాల నుంచి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, బ్రాహ్మణ సమాజ మహిళలు ఎదుర్కొన్న సమస్యలను కూడా ప్రశ్నిస్తూ ఆ వర్గాల మహిళల హక్కుల రక్షణకు పాటుపడ్డారన్నారు. శిశు హత్యా నిరోధక గృహాలను ఏర్పాటు చేశారని, మాతాశిశు మరణాల నిరోధానికి పాటు పడ్డారన్నారని తెలిపారు. సమాజం ఎదిరించినా తన భర్త జ్యోతిరావు పూలే అంత్యక్రియలు తానే నిర్వహించి ఆదర్శ మహిళగా నిలిచిందన్నారు. పూలే జీవితం, ఆద ర్శ భావాలూ భవిష్యత్ తరాలకు అవసరమని, విశ్వవిద్యాలయాల్లో ఆమె జీవితంపై మరింత అధ్యయనం జరగాల్సిన అవసరముందన్నారు. ఉపకులపతి ప్రొ.కే.సీతారామరావు మాట్లాడుతూ ఆదర్శ భావాలు కలిగిన పూలే సమసమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రొ. చల్లపల్లి స్వరూపారాణి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.ఎ.వి.ఎన్.రెడ్డి, విశ్వవిద్యాలయ మహిళాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి డా.మేరీ సునంద, సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొ.ఐ.ఆనంద్ పవార్, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొ.చంద్రకళ, లైబ్రరీ ఇన్‌చార్జి డా.ఎన్.రజని, డా.జి.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి సమాజం కోసం కలిసి నడుద్దాం : ఆర్పీ పట్నాయక్


యూత్ ఫర్ యాంటీ కరప్షన్ 2024 క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

పంజాగుట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం కలిసి నడుద్దామని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారు, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. సోమవారం ఎర్రమంజిల్ కాలనీ యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సంస్థ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తమ వంతు బాధ్యతగా తెలుగు రాష్ట్రాల్లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమాలతో ముందుకు నడవడం అభినందనీయమన్నారు. అవినీతిని ప్రశ్నించడమే కాకుండా, నిజాయితీని బ్రతికించాలనే ఆలోచనతో సమాజంలోని వివిధ రంగాల్లో పనిచేసిన, పనిచేస్తున్న అధికారులను గుర్తించి నేటి యువతరానికి పరిచయం చేయడం వల్ల, మంచి ఆలోచన గల యువత తయారవుతారన్నారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రాజేంద్ర, సలహాదారులు డాక్టర్ గాదిరాజు స్రవంతి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, జాతీయ కార్యవర్గసభ్యులు రమేశ్ బాబు, రాజేశ్, రాష్ట్ర కార్యదర్శి దేవేందర్, ప్రేమ రాజ్‌పాల్గొన్నారు.

ప్రకృతితో పయనిస్తే ఎన్నో అద్భుతాలు


గోల్ఫ్‌క్లబ్ టోర్నమెంట్‌లో విజేతలైన విద్యార్థినులు

యూసుఫ్‌గూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాలుగు గోడల మధ్య చదువుతూ ఉండటం, సురక్షిత ప్రాంతాల్లోనే నిరంతరం జీవనం సాగించటమే పిల్లల్లో ఎదుగుదలకు ఆటంకాలుగా ఉంటాయని, ఒక రోజు తెల్లవారుజామున చల్లని చలిలో కురిసే మంచులో పిల్లలకు కెమెరాలు ఇచ్చి పంపితే ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని మహాత్మాగాంధీ మెమోరియల్(ఎంజీఎం) ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఎంఎం నాయు డు, ప్రిన్సిపాల్ కిరణ్‌నాయుడు అన్నారు. గోల్ఫ్‌క్లబ్ 8వ వార్షికోత్సవం సం దర్భంగా గోల్ఫ్‌క్లబ్ ఫర్ వైల్డ్‌లైఫ్, నేచర్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలో ప్రకృతిలోని జీవరాసులు, ప్రకృతికి సంబంధించిన అంశాల పై డిబేట్, ఫొటోగ్రఫీ తదితర అంశాలపైనే పోటీ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎంజీఎం స్కూల్ యాజమాన్యం తమ విద్యార్థులకు కెమెరాలు ఇచ్చి తెల్లవారుజామున చలి, మంచులో బయటకు పంపించారు. అనంతరం వారు పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో పదో తరగతికి చెందిన లోహిత, వర్షిణిలు డిబేట్‌లో ప్రకృతి గురించి ప్రసంగించి మొదటి స్థానం సంపాదించారు. స్కూల్ టీమ్ ఫొటోగ్రఫీలో ఎన్నో ఆసక్తి కరమై న ఫొటోలు తీసి ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి గోల్ఫ్‌క్లబ్ వారు సర్టిఫికెట్‌లు, మెమోంటోలు అందించి అభినందించారు.

చెస్‌తో మేధస్సు పెరుగుతోంది


చిన్నారులతో చెస్ ఆడుతున్న చెస్ క్రీడాకారుడు సెర్జి తివియాకోవ్

బేగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చెస్ క్రీడ చాలా తెలివైన ఆట అని, బేగంపేట చెస్ స్కూల్ చిన్నారుల్లో విశేష ప్రతిభ ఉందని రష్యన్ చెస్ క్రీడాకారుడు, సూపర్ గ్రాండ్ మాస్టర్ సెర్జి తివియాకోవ్ అన్నారు. సోమవారం బేగంపేటలోని బేగంపేట చెస్ స్కూల్లో చిన్నారులతో చెస్ ఆడారు. క్రీడాకారులకు పలు మెళకువలు, సూచనలు చేశారు. భారతీయులు కనిపెట్టిన చెస్ క్రీడ ప్రపంచంలో తెలివైన ఆటగా ప్రసిద్ధి కెక్కిందని, చెస్‌తో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. చెస్ స్కూల్లోని క్రీడాకారుల శిక్షణ చాలా బాగుందని, చిన్నారుల విభాగంలో చెస్ స్కూల్ క్రీడాకారులు ఇంటర్నేషనల్ ఛాంపియన్స్‌గా నిలవడం అభినందనీయమన్నారు. సెర్జి తివియాకోవ్ వరల్డ్ ఛాంపియన్‌గా గెలిచారని, సూర్ గ్రాండ్ మాస్టర్ అని, ఆయన అపారమైన అనుభవం స్కూల్ చిన్నారులకు ఉపయోగపడుతుందని కోచ్‌లు చైతన్య మురళి, స్రవంతి అన్నారు. తాము పిలిచిన వెంటనే వచ్చి తన అనుభవాలను క్రీడాకారులతో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. తక్కువ సమయంలో చెస్ స్కూల్ చిన్నారులు ఇంటర్నేషనల్లో ఛాంపియన్స్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ, కోచ్ సందీప్‌నాయుడు, కోచ్ భరత్‌కుమార్‌రెడ్డి, క్రీడాకారులు వియాన్, కార్తికేయ పాల్గొన్నారు.

సినిమాలో నటించినందుకు డబ్బులు ఇవ్వకపోగా..
దుర్భాషలాడిన దర్శకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సినిమాలో ఛాన్స్ ఓ పాత్రలో ఇస్తాను నటించాలని కోరాడు.. ఇందుకు తగ్గ డబ్బు ఇస్తానని చెప్పిన దర్శకుడు ఆ తర్వాత రెమ్యునరేషన్ ఇవ్వకపోగా దుర్భాషలాడాడు. సరూర్‌నగర్‌కు చెందిన దివ్యప్రశాంతి గృహిణి. ఆగస్టు 2022లో కార్తీక్ అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేశారు. భోళాశంకర్(చిరంజీవి నటించింది కాదు) సినిమా దర్శకుడిని అని పరిచయం చేసుకున్నాడు. సినిమాలో ఓ పాత్ర ఉందని అందులో నటించాలని కోరాడు. అంతే కాదు నటించిన దానికి రోజుకు ఐదు వేల రూపాయలతో పాటు రాకపోకలకు అదనంగా ప్రతి రోజు మూడు వేలు ఇస్తానని నమ్మబలికాడు. అంతే కాదు తనకు గచ్చిబౌలిలో స్టూడియో ఉందని చెప్పాడు. మొత్తానికి దివ్య ప్రశాంతి ఒప్పుకొని నటించింది. ఆ తర్వాత నుంచి రెమ్యూనరేషన్ కోసం కార్తీక్‌కు ఫోన్ చేసి అడగగా అతను దాట వేసే దోరణిలో మాట్లాడుతూ వచ్చాడు. ఈనెల 6న బంజారాహిల్స్‌లోని కార్తీక్ కార్యాలయానికి ఆమె వచ్చారు. డబ్బు ఇవ్వాలని నిలదీయగా కార్తీక్ దుర్భాషలాడాడు. అడ్డు చెప్పబోయిన ఆమె వద్ద ఉద్యోగులను కూడా దుర్భాషలాడాడు. మోసపోయినట్టు గ్రహించిన ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లలితా జ్యువెలరీలో చోరీ

● బంగారు గాజులు చోరీ చేసిన ఇద్దరు మహిళలు

పంజాగుట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట లలితా జ్యువెలరీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్ దృష్టి మళ్లించి ఇద్దరు మహిళలు 58 గ్రాముల బరువున్న నాలుగు బంగారు గాజులు దొంగలించారు. షోరూం మూసివేసే సమయంలో ఆభరణాలను సరి చూసుకోగా చోరీ విషయం బయట పడింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట లలితా జ్యువెలరీలో ఈనెల 6న రాత్రి మేనేజర్ ప్రసాద్, సిబ్బంది ఆ రోజు బంగారు ఆభరణాల క్రయ, విక్రయాలు ముగిసిన తర్వాత అన్ని అంతస్థుల్లోని షోకేసుల్లో ఆభరణాలను లెక్కిస్తుండగా మొదటి అంతస్థులోని ఒక షోకేసులో 58 గ్రాముల బరువు ఉన్న నాలుగు బంగారు గాజులు కనిపించలేదు. దీంతో వారు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఇద్దరు గుర్తు తెలియని మహిళలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడానికి వచ్చి, సేల్స్ ఎగ్జిక్యూటీవ్ దృష్టి మళ్లించి నాలుగు బంగారు గాజులు దొంగలించినట్టు గుర్తించారు. వారిపై షోరూం మేనేజర్ ప్రసాద్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. షోరూం లోపల, బయట, పంజాగుట్ట, సోమాజిగూడ ప్రధాన రహదారిలో సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

మ్యాన్‌హోల్‌లో వ్యర్థాల తొలగింపునకు కొత్త వాహనం


వ్యర్థాల తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మ్యాన్ హోల్‌లో వ్యర్థాల తొలగించడానికి కొత్తగా డీప్ డిసిల్టింగ్ వాహనాన్ని ఉపయోగిస్తున్నామ ని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య అన్నారు. సోమవారం రహమత్‌నగర్ గురుద్వారా వీధిలో కొత్తగా వచ్చిన డీప్ డిసిల్టింగ్ వాహనంతో మ్యాన్ హోల్‌లో వ్యర్థాల తొలగింపు పనులను ఆమె పరిశీలించా రు. లోతు ఎక్కువగా ఉన్న మ్యాన్‌హోల్స్‌లో ఈ వాహనం ద్వారా వారం రోజుల్లో వ్యర్థాలను తొలగించి, మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేపించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట జలమండలి మేనేజర్ సూర్య స్థానిక నాయకులు షాబాజ్, పూజారి బాలు, జహంగీర్, అఫ్సర్, యాదగిరి ఉన్నారు.

జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలు సమన్వయంతో పనిచేయాలి

జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలు సమన్వయంతో పనిచేయాలని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 ఈఈ రాజ్ కుమార్, డీఈ రామచంద్రరాజు, జలమండలి మేనేజర్ సూర్యలతో సమావేశమయ్యారు. కొత్త వాటర్, సివరేజ్ పైప్‌లైన్లు వేసేటప్పుడు రహదారిని తవ్వడానికి ఇచ్చే అనుమతుల్లో ఆలస్యం చేయవద్దని, పనులు పూర్తి అయిన వెంటనే కొత్తగా రహదారి వేయాలని, గుంతలు పూడ్చాలని సూచించారు. రెండు విభాగాలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు.


ఫుట్‌పాత్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

దశలవారీగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే గోపీనాథ్

ఎర్రగడ్డ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ తెలిపారు. సోమవారం ఆయన డాన్ బాస్కో స్కూల్ ఎదురుగా రూ.30 లక్షలతో నిర్మించతలపెట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో డాన్‌బాస్కో స్కూల్ నుండి బి శంకర్లాల్‌నగర్ బీఆర్ఎస్ జెండా వరకు రెండు వైపులా ఫుట్‌పాత్ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగడ్డ వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు డి సంజీవ, నాయకులు గంటా మల్లేష్, జావిద్, మహమ్మద్ అజీమ్, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, నర్సింహారావు, రొంపి బాలకృష్ణ, దాసి శ్రీకాంత్, ఎస్ నాను, పి జయంత్, రజియా, కళ్యాణి, సక్కుబాయి, సైదమ్మ, నాయకులు మహమ్మద్ అజర్, మహమ్మద్ ఆమీర్ పాల్గొన్నారు.


జ్యూట్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు అన్నం కోటిరెడ్డి తదితరులు

ప్లాస్టిక్ నిషేధానికి ముందుకు రావాలి

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎర్రగడ్డ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ డిస్టిక్ 320 డి ఎన్విరాన్మెంట్ కార్యదర్శి అన్నం కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జ్యూట్ బ్యాగులను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ మూలంగా పరిసరాలు కాలుష్యమయంగా మారుతున్నాయని, భవిష్యత్ తరాలకు కాలుష్య రహితమైన పరిసరాలను అందించాలంటే ఇప్పటి నుంచి ప్లాస్టిక్ నిషేధించాలని ఆయన సూచించారు. నాయకులు, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, భువనేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌నాయుడు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

10న రౌండ్ టేబుల్ సమావేశం

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపైన ఈనెల 10న సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌదాని భూమన్నయాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, తదితరులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని సర్పంచులు అందరూ పాల్గొవాలని ఆయన కోరారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేష్, అధికారులు

తొలిరోజు ప్రజావాణిలో 8 ఫిర్యాదులు

ఖైరతాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చాలా రోజుల నుంచి ఆగిపోయిన ప్రజావాణి జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో తిరిగి ప్రారంభమైంది. సోమవారం జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే పలువురు అధికారులతో కలిసి ప్రజావాణిలో అందుబాటులో ఉండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. మొదటి రోజు మొత్తం 8 మంది ప్రజావాణిలో తమ ఫిర్యాదులను అందించగా అందులో 7 టౌన్‌ప్లానింగ్‌కు చెందినవే వచ్చాయి. మరొకటి ఆస్తిపన్నుకు సంబంధించిన ఫిర్యాదు వచ్చిందని అధికారులు తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపామని వాటిని త్వరలో పరిష్కరింపజేస్తారని జోనల్ కమిషనర్ తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, తదితరులు

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కోదండరాం

పంజాగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ, కమ్యూనిటీ పారా మెడిక్స్ అనుభవ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుకెళ్లి మాట్లాడుతానని తెలంగాణ జన సమితి(టీజేఎస్)అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ, కమ్యూనిటీ పారా మెడిక్స్, అనుభవ వైద్యుల సంఘం 17వ వార్షికోత్సవ మహాసభ, 2024 క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ, వైద్య సంఘాల సమాఖ్య చైర్మన్ చొప్పరి శంకర్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు రౌతు కనకయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి వెంకట్‌రెడ్డి, టీఆర్పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వెంకట్‌రెడ్డి, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

బేగంపేటలో వ్యాన్ దగ్ధం


మంటల్లో కాలిపోతున్న ఓమ్నీ వ్యాన్

బేగంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ప్రకాశ్‌నగర్ మెట్రో సమీపంలో వెళ్తున్న మారుతీ ఓమ్నీ వ్యాన్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగి దగ్ధమయింది. సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో పాటిగడ్డకు చెందిన రషీద్ తన ఓమ్నీ వ్యాన్‌లో గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేట విమానాశ్రయం వైపునకు వెళ్తున్నారు. ప్రకాశ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్దకు రాగానే ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో వ్యాన్‌ను ఆపి రషీద్ కిందకు దిగాడు. క్షణాల్లోనే మంటలు అంటుకోవడంతో వ్యాన్ దగ్ధమైంది. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్‌కు చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. రహదారిపై వ్యాన్‌కు మంటలు అంటుకోవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బేగంపేట ఫ్లై ఓవర్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. దగ్ధమైన వ్యాన్‌ను పోలీసులు క్రేన్ ద్వారా తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కమ్యూనిజం, క్యాపిటలిజాలతో సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు

● ప్రఖ్యాత విధానాల రూపకర్త సాం పిట్రోడా
● 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' ఆవిష్కరించిన భట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం శుభపరిణామని దేశంలో టెలికాం విప్లవానికి ఆద్యుడైన సాం పిట్రోడా అభివర్ణించారు. ఆయన రాసిన 'రీడిజైన్ ది వరల్డ్' పుస్తకానికి పోలిదాసు నరసింహారావు తెలుగు అనువాదం 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' పుస్తకాన్ని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆన్‌లైన్ వేదికగా సాం పిట్రోడా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అన్నీ ప్రజాస్వామ్య దేశాలలో నియంతృత్వం చోటుచేసుకొందని ఆయన వ్యాఖ్యానించారు. కమ్యూనిజం, క్యాపిటలిజం... ఈ రెండు వ్యవస్థలూ ప్రపంచాన్ని సుఖంగా ఉంచలేవని, అవి మానవాళి సమగ్రాభివృద్ధికి తోడ్పడవని అభిప్రాయపడ్డారు. 'కమ్యూనిజాన్ని వదిలి, ఇవాళ క్యాపిటలిజం నమూనాను ఎంపిక చేసుకున్నాం. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ అంతకంతకూ అసమానతలు పెరగడాన్ని చూస్తున్నామని' సాం పిట్రోడా అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో పాలకులు సాగిస్తోన్న నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చదువుతున్న సమయంలో తాను సాం పిట్రోడా ప్రభావానికి లోనైనట్లు తెలిపారు. 'సాం పిట్రోడా 80ఏళ్ల వయసులోనూ ప్రపంచాన్ని మార్చడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో రోజుకు 16గంటలు శ్రమిస్తున్నారు. ఆయన అంకితత్వం, సృజనాత్మకత, అత్యున్నత ప్రతిభ, దార్శనికత లాంటి వన్నీ నాకెంతో స్ఫూర్తినిచ్చాయి' అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, విశ్రాంత ఐపీఎస్ సాంబశివరావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎమ్మెస్కో ఎడిటర్ డి. చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన కొత్తపల్లి రమేష్‌గౌడ్‌ను బీకేగూడ యశ్ జిమ్‌లో సన్మానించిన రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోచ్ ఆనంద్‌రాజ్, అధ్యక్షుడు దండు మల్లేష్‌గౌడ్, గోపాలకృష్ణగౌడ్, సీహెచ్ శంకర్‌గౌడ్, బొడ్డు ప్రసాద్‌గౌడ్, జ్ఞానప్రకాష్, బి కృష్ణగౌడ్ తదితరులు. - హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

న్యాయవాది ఫోన్ హ్యాక్ చేసి మోసం

బంజారాహిల్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళా న్యాయ వాది ఫోన్‌ను అక్రమంగా హాక్ చేయడంతో పాటు మోసపూరితంగా అందులో ఉన్న సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఓ క్రెడిట్ కార్డు సర్వీస్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12కు చెందిన ఎండీ అస్మర న్యాయవాది. కొద్ది రోజుల క్రితం హిమాయత్‌నగర్‌లోని బజాజ్ ఎలక్ట్రికల్స్‌లో ఆమె ఓ టీవీ కొనుగోలు చేశారు. టీవీఎస్ క్రెడిట్ సర్వీస్ వద్ద వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు ఒప్పుకున్నారు. ఇందుకు గాను ఓ చెక్కు కూడా క్రెడిట్ సర్వీస్ సిబ్బందికి అందించారు. ఇంటికి వచ్చాక చెక్కు పై తన ఇంటి పేరు తప్పుగా పడిందని గ్రహించిన ఆమె టీవీఎస్ క్రెడిట్ సొసైటీ సిబ్బందికి పలు మార్లు ఫోన్ చేసి సూచించారు. కానీ వారు ఆ తప్పును సరిదిద్దుకోకపోగా ఈనెల 6న అర్ధరాత్రి తర్వాత అస్మర్ ఫోన్‌ను హాక్ చేసి ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న సమాచారాన్ని తీసుకునేందుకు ప్రయత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురికి జైలు

ఖైరతాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుట్టుగా గంజాయి అమ్ముతూ ముగ్గురు యువకులు పోలీసులకు చిక్కారు. అందులో ఇద్దరు విద్యార్థులు కాగా మరొకరు ప్రైవేటు ఉద్యోగి. ఖైరతాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ధర్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ చౌరస్తాలోని పెరిక భవన్ సమీపంలో గంజాయి అమ్ముతున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లగా అనుమానాస్పద స్థితిలో తచ్చాడుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 400 గ్రాముల గంజాయి లభించింది. వారి వద్ద ఉన్న 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని విచారించగా తాము అవసరం ఉన్న వారికి గంజాయి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. పెద్దపల్లికి చెందిన వడ్లగుండ యశ్వంత్(20) ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో ఉంటూ బికామ్ చదువుతున్నాడని ఇతడు మంచిర్యాల నుండి గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నాడని తెలిపారు. ఆయనకు గోదావరిఖనికి చెందిన అఖిల్ పంజాగుట్టలోని హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ సహకరిస్తున్నాడని డీఐ తెలిపారు. కడప రాజంపేటకు చెందిన వి.సుకుమార్(21) నగరంలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తూ పంజాగుట్టలోని హాస్టల్‌లో ఉండి గంజాయి అమ్మకంలో యశ్వంత్‌కు సహకరిస్తున్నాడని గుర్తించి ముగ్గురినీ సోమవారం రిమాండ్‌కు తరలించారు. గంజాయి, మత్తు పదార్థాలను చట్టవిరుద్ధంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని డీఐ ధర్మారావు తెలిపారు

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా


ఉబేష్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ దిగుతుండగా రైలు ఢీకొని ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బొల్లారం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ధానాపూర్ షాహపూర రాంపూర్ గ్రామానికి చెందిన ఉబేష్ (16) బొల్లారంలోని బాబాయి ఇంటికి వచ్చాడు. సమీపంలోని రైలు పట్టాల వద్ద మైదానంలో ఆడుకునేందుకు ఆదివారం వచ్చాడు. పట్టాల వద్దకు వెళ్లిన ఉబేష్ రైలు వస్తున్న క్రమంలో సెల్ఫీ తీసుకుంటుండగా, రైలు ఢీకొట్టింది. బలమైన గాయాలతో ఉబేష్ అక్కడికక్కడే మరణించాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

భర్తతో గొడవ పడి గృహిణి ఆత్మహత్య


భర్తతో మృతురాలు చందన

బంజారాహిల్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కొత్తగూడేనికి చెందిన చందన(26)కు రెండేళ్ల క్రితం ఖమ్మంకు చెందిన రమణతో వివాహం జరిగింది. రమణ నిర్మాత బండ్ల గణేష్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరూ కలిసి బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని ఇందిరానగర్‌లో గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. డిప్లొమా చదివిన చందన కొంతకాలంగా ఓ జువెలరీ షాపులోసేల్స్‌గర్ల్‌గా పనిచేసి ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. మూడురోజుల క్రితం రమణ, చందన ఖమ్మం వెళ్లి ఆదివారం తిరిగి వచ్చారు. కాగా ఊర్లో ఉన్నప్పుడే భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పాటు ఆదివారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 6గంటలకు రమణ డ్యూటీకి వెళ్లాక కొంతసేపటికి వాట్సాప్ వీడియో కాల్ చేసిన చందన తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. భర్త వారిస్తుండగానే గదిలోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్న చందన ఆత్మహత్యకు పాల్పడింది. దాంతో రమణ పక్కింట్లోని వ్యక్తులకు ఫోన్‌చేసి చెప్పడంతో వారు వచ్చి చూసేసరికి మృతిచెందింది. ఈ మేరకు స్థానికులు సమాచారం అందించడంతో బంజారాహిల్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతురాలి కుటుంబసభ్యులు కొత్తగూడెం నుంచి వచ్చిన తర్వాతనే ఏం జరిగిందనే విషయంపై స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నేడు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేదవారైన గర్భిణుల కోసం నీలిమ హాస్పిటల్ 'నీలిమ 9' పేరుతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తోందని ఆస్పత్రి ఎండి నీలిమా శ్రీనివాస్ తెలిపారు. ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.



బాధితురాలికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.లాస్యనందిత

ఎల్‌ఓసీ అందజేత

మారేడ్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద రోగులు అత్యవసర చికిత్స పొందేందుకు ఎల్‌ఓసీ ఎంతో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత తెలిపారు. ఎల్‌ఓసీ విషయంలో ఏమాత్రం జాప్యం లేకుండా నిరుపేద రోగులకు త్వరగా సాయం అందేలా చూస్తామన్నారు. ఈమేరకు 7వ వార్డుకు చెందిన శ్రీదేవికి ఎమ్మెల్యే లాస్యనందిత ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. చెక్కును అందజేసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు సీనియర్ నాయకులు కేబీ శంకర్ రావు, ఖదీరవన్ తదితరులు ఉన్నారు.



సీఎం ఓఎస్‌డీ ప్రత్యేక పూజలు

తాడ్‌బంద్ వీరాంజనేయస్వామి ఆలయాన్ని సోమవారం ముఖ్యమంత్రి ఓఎస్‌డీ అజిత్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- సికింద్రాబాద్,ఆంధ్రజ్యోతి



వంట సామగ్రి అందజేస్తున్న సాద కేశవరెడ్డి

కంటోన్మెంట్‌లోని ఆలయాల అభివృద్ధికి కృషి

సికింద్రాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్టు కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి చెప్పారు. రసూల్‌పురా ఉషా గిడ్డంగి వద్ద ప్రతి అమావాస్యను పురస్కరించుకుని అన్నదానం చేస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్, పోచమ్మ టెంపుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆయన సోమవారం రెండు లక్షల రూపాయల విలువైన వంట సామాగ్రి అందచేశారు.



కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టీ.ఎన్.శ్రీనివాస్, బస్తీ అభివృద్ధి కమిటీ సభ్యులు

రోడ్డు కబ్జా కాకుండా చూడండి

ఇందిరమ్మనగర్ అభివృద్ధి కమిటీ

సికింద్రాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మనగర్ రామాలయం ఎదురుగా రోడ్డును కబ్జా బారి నుంచి రక్షించాలని బస్తీవాసులు కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్తీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంగల్ నాగేష్, మహేష్, శ్యామ్, శ్యాంరెడ్డి, స్వామి, రవి, నరేష్, పాండునాయక్ తదితరులు సోమవారం ఆయనను కలిశారు. రామాలయం ఎదురుగా ఉన్న రోడ్డును ఓ వ్యక్తి కబ్జా చేయడానికి యత్నిస్తున్నాడని, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు కె.సత్యనారాయణ తదితరులు

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అడ్డగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలోని భక్త మార్కెండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కే.సత్యభూషణం, ప్రధాన కార్యదర్శి కోట నర్సింగ్ రావుల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్లను సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గ్రేటర్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, ప్రధాన కార్యదర్శి రాజు, అడ్డగుట్ట పద్మశాలి సంఘం ప్రతినిధులు శ్రీరాములు, గొసిక దుబ్బరాజేశం, మార్కెండేయ, బొడ్డు సంతోష్, చిలివేరి రామకృష్ణలు పాల్గొన్నారు.



తెలంగాణ కేబుల్ టీవీ యాజమాన్యాల కోర్ కమిటీ

కేబుల్ టీవీ యాజమాన్యాల కోర్ కమిటీ ఎన్నిక

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కేబుల్ టీవీ యాజమాన్యాల కోర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కోర్ కమిటీని ఎన్నుకున్నారు. కోర్ కమిటీ సభ్యులుగా కె.కోటేశ్వరరావు, హెచ్.వి.చలపతిరాజు, అనంచిన్ని వెంకటేశ్వరరావు, ఎం.రవికుమార్, కృష్ణంరాజు, జితేందర్, దేవేందర్, రవీందర్, సాజితాసికిందర్, సీహెచ్ శ్రీనివాస్‌రావు, బ్రహ్మం, గిరి, రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

మీ పిల్లలు జాగ్రత్త

జీఆర్‌పీ స్మైల్ ఆపరేషన్ అధికారి రమేష్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్పెషల్ డ్రైవ్



ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జీఆర్‌పీ స్మైల్ ఆపరేషన్ అధికారి ఎస్సై రమేష్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అసలే సంక్రాతి పండుగ ప్రయాణికుల రద్దీ. స్టేషన్‌లోకి ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి, ప్రయాణికులను అప్రమత్తం చేసేందుకు సికింద్రాబాద్ జీఆర్‌పీ ఎస్ఐ స్మైల్ ఆపరేషన్ అధికారి రమేష్ సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ పండగ సమయాలలో హైద్రాబాద్ నుంచి వివిధ రాష్ట్రాలకు రైలు మార్గంలో వెళ్లే లక్షల మంది ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో తమ పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని కోరుతూ రైలులో ప్లాట్ ఫాంపై ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ అవగాహనకల్పిస్తున్నామన్నారు. రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తమ పిల్లలు రైలు ఎక్కే వరకు గమనించాలని, ఎవరైనా పిల్లలతో సన్నిహితంగా ఉండినట్లు అనుమానం వస్తే వెంటనే 139, 100 నెంబరుకు సమాచారం ఇస్తే క్షణాల్లో మీ వద్దకు వస్తామని, ఎవరు కూడా అధైర్య పడకుండా మీ ప్రయాణం ప్రశాతంగా జరుపుకోవాలని పలు సూచనలిచ్చామన్నారు. ఈ స్మైల్ ఆపరేషన్‌లో ప్రతినిధి గంగ, కాచిగూడ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావులతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాన్ని సాధించిన ఎం.దివ్యశ్రీతో కోచ్ భూపాల్



కాంస్య పతకాన్ని సాధించిన కె.స్రవంతితో కోచ్ భూపాల్

బోయిన్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ స్కూల్స్ రాష్ట్రస్థాయి క్రీడలు కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసానిలో జరిగాయి. ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీల ఎంపిక నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ జిల్లాలకు చెందిన గిరిజన సంక్షేమ పఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో హైదరాబాద్ జిల్లా బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని గిరిజన సంక్షేమ పాఠశాలకు చెందిన ఎం.దివ్యశ్రీ 3వేల మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని, దివ్యశ్రీ 15 వందల మీటర్ల పరుగు పందెంలో కాంస్యపతకాన్ని, కె.స్రవంతి 500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని కైవశం చేసుకుని ప్రతిభ కనబర్చి ఈ నెలాఖరులో కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జరుగనున్న ఐఎస్‌ఎల్ క్రీడలకు ఎంపిక కావడం జరిగింది. గిరిజన సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, క్రీడాశాఖ అధికారిణి పీడీ జ్యోతి, బోయిన్‌పల్లి గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, కోచ్ భూపాల్, శివానందలు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ ధర్నా



రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో కార్మిక నాయకుల నిరసన



దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొత్త పెన్షన్ రద్దు చేసి పాతన పెన్షన్ అమలు చేయాలని కోరుతూ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో జోన్ అధ్యక్షుడు చౌదరితో పాటు యూనియన్ నాయకులు కార్మిక నాయకులు సోమవారం సికింద్రాబాద్ లోకో షెడ్డు కార్యాలయంలో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు ప్రతాప్, నాగేశ్వర్‌రావు, రాజిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం సికింద్రాబాద్ వర్క్‌షాప్‌లో కార్మికులు, యూనియన్ నాయకులు ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని శంకర్‌రావు విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రవీందర్‌తో పాటు పలువురు కార్మిక నేతలు పాల్గొన్నారు.

కమ్యూనిజం, క్యాపిటలిజాలతో సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు

- ప్రఖ్యాత విధానాల రూపకర్త సాంపిట్రోడా
- 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' ఆవిష్కరించిన భట్టి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం శుభపరిణామమని, దేశంలో టెలికాం విప్లవానికి ఆద్యుడైన సాంపిట్రోడా అభివర్ణించారు. ఆయన రాసిన 'రీడిజైన్ ది వరల్డ్' పుస్తకానికి పోలిదాసు నరసింహారావు తెలుగు అనువాదం 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' పుస్తకాన్ని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆన్‌లైన్ వేదికగా సాంపిట్రోడా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అన్ని ప్రజాస్వామ్య దేశాలలో నియంతృత్వం చోటుచేసుకొందని ఆయన వ్యాఖ్యానించారు. కమ్యూనిజం, క్యాపిటలిజం ... ఈ రెండు వ్యవస్థలూ ప్రపంచాన్ని సుఖంగా ఉంచలేవని, అవి మానవాళి సమగ్రాభివృద్ధికి తోడ్పడవని అభిప్రాయపడ్డారు. "కమ్యూనిజాన్ని వదిలి, ఇవాళ క్యాపిటలిజం నమూనాను ఎంపిక చేసుకున్నాం. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ అంతకంతకూ అసమానతలు పెరగడాన్ని చూస్తున్నామని" సాంపిట్రోడా అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో పాలకులు సాగిస్తోన్న నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చదువుతున్న సమయంలో తాను సాంపిట్రోడా ప్రభావానికి లోనైనట్లు తెలిపారు. "సాం పిట్రోడా 80ఏళ్ల వయసులోనూ ప్రపంచాన్ని మార్చడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో రోజుకు 16గంటలు శ్రమిస్తున్నారు. ఆయన అంకితత్వం, సృజనాత్మకత, అత్యున్నత ప్రతిభ, దార్శనికత లాంటివన్నీ నాకెంతో స్ఫూర్తినిచ్చాయి" అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, విశ్రాంత ఐపీఎస్ సాంబ శివరావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎమ్మెస్కో ఎడిటర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసులు లేని భూమిని..

ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

- భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వారసులు లేని 286 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భూమిని విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలానగర్ మండలం కూకట్‌పల్లి గ్రామంలోని దివంగత నవాబ్ రయీస్ యార్‌జంగ్ బహదూర్‌కు చెందిన సర్వే నెంబర్ 1007లోని 286 ఎకరాల భూమి ఉందని, వారసులు లేకపోవడంతో ఈ భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. హైటెక్ సిటీకి అతి సమీపంలో ఉన్న ఈ భూమి విలువ 22 వేల 880 కోట్ల రూపాయలు ఉంటుందన్నారు.

ఈ భూమి యజమాని 1960లో చనిపోగా అతని వారసులు కూడా చనిపోయారని తెలిపారు. అయితే, మనవడి పేరుతో కొంతమంది ఈ భూమిని కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. నకిలీ పత్రాలు, గిఫ్ట్ డీడీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని విక్రయించి, వచ్చే ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూమి కబ్జాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ కూడా రాశామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, సీ.హెచ్.శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

జీహెచ్‌ఎంసీ ప్రజావాణికి స్పందన కరవు

సికింద్రాబాద్ జోన్‌లో మూడే ఫిర్యాదులు

సికింద్రాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. జోన్‌లోని అన్ని సర్కిళ్ల నుంచి మూడు ఫిర్యాదులు మాత్రమే అందాయి. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, మెట్రో వాటర్ బోర్డు చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు. కాగా బేగంపేట్ సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని కొందరు ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరిలో కొందరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. అలాగే జనన ధృవీకరణ పత్రంలో తప్పులు దొర్లాయని ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోగా వెంటనే అధికారులు సరిదిద్దారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం



బాల్‌రాజ్

మారేడ్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు గత నెల పదో తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్ళి తిరిగి రాలేదు. మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పికెట్ గాంధీ కాలనీలో నివాసముంటున్న బాల్‌రాజ్ (60) వృత్తి రీత్యా లేబర్. డిసెంబర్ 10వ తేదీన బైటికి వెళ్ళి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్ళి ఇప్పటివరకు తిరిగి రాలేదు. దీంతో తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య లక్ష్మి ఆదివారం మారేడ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు మారేడ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఫిట్స్ వచ్చి కిందపడిపోయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మరణించిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబర్ 6లో ఆదివారం ఫిట్స్‌తో ఓ వ్యక్తి కిందపడిపోయి ఆపస్మారక స్థితిలోకి పోవడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికుడి చేతిపై అవినాష్ అని పచ్చబొట్టు రాసి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగు చుక్కల చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా వడ్డెపర్తి ప్రాంతానికి చెందిన ఎలిమినేటి సాయినాథ్ రెడ్డి (29) ఓ ప్రవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంత కాలంగా అప్పులపాలై, తాగుడికి బానిసై తీవ్ర మనస్థాపంతో సోమవారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ..

కవాడిగూడ : అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కవాడిగూడ పతంగ్ బిల్డింగ్ వద్ద సోమవారం జరిగింది. గాంధీనగర్ ఎస్ఐ కావ్య తెలిపిన వివరాల ప్రకారం... కవాడిగూడ పతంగ్ బిల్డింగ్ వద్ద నివాసం ఉండే కె.మల్లేష్, తల్లిసక్కుబాయికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నవాడైన కె.మహేష్(29) డ్రైవర్. కొంతకాలంగా మహేష్ అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. సోమవారం ఉదయం అందరూ పనులకు వెళ్లడంతో ఒంటరిగా ఉన్న మహేష్ డోరు పెట్టుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపు పెట్టి ఉంది. ఎంతకీ తీయకపోవడంతో బలవంతంగా తలుపు తీసి చూడగా మహేష్ ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంకు సమాచారం అందించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తన కుమారుడు మహేష్ అప్పుల బాధతో ఉరివేసుకున్నాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గాంధీనగర్ ఎస్ఐ కావ్య తెలిపారు.

బ్రెయిన్‌డెత్‌కు గురైన వ్యక్తి నుంచి అవయవాల సేకరణ

మన్సూరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెత్‌కు గురైన వ్యక్తి నుంచి కామినేని ఆస్పత్రి వైద్యులు అవయవాలను సేకరించారు. ఆస్పత్రి ప్రతినిధుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా పెద్దవూర మండలం పులిచర్ల గ్రామానికి చెందిన మావిళ్ల సైదులు (33) ఈనెల 5న తన ఇంటి వద్ద అనుకోకుండా కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు అవటంతో అతన్ని ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. బ్రెయిన్‌డెత్‌కు గురైనట్లు ఆదివారం రాత్రి వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సైదులు శరీరం నుంచి లివర్, కిడ్నీలు, కంటి శుక్లాలను సేకరించినట్లు ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా



ఉబేష్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ దిగుతుండగా రైలు ఢీకొని ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బొల్లారం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. దానాపూర్ షాహాపూర రాంపూర్ గ్రామానికి చెందిన ఉబేష్ (16) బొల్లారంలోని బాబాయి ఇంటికి వచ్చాడు. సమీపంలోని రైలు పట్టాల వద్ద మైదానంలో ఆడుకునేందుకు ఆదివారం వచ్చాడు. పట్టాల వద్దకు వెళ్లిన ఉబేష్ రైలు వస్తున్న క్రమంలో సెల్ఫీ తీసుకుంటుండగా, రైలు ఢీకొట్టింది. బలమైన గాయాలతో ఉబేష్ అక్కడికక్కడే మరణించాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.



పాడి రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయ డెయిరీ ఎండీ ఇట్టెమ్ లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న విజయ డెయిరీ పరిరక్షణ సమితి సభ్యులు

- తార్నాక, ఆంధ్రజ్యోతి